ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 17 ఆగస్టు 2025 | 5



జిల్లా అంతటా కృష్ణాష్టమి వేడుకలు

జిల్లావ్యాప్తంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉట్టి కొట్టారు. - వార్తలు లోపలి పేజీల్లో



జగ్గంపేటలో ఉట్టి కొడుతూ..



గౌతు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న : జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో చురుకుగా పాల్గొని శ్రీకాకుళం, విజయనగరం ఇతర ప్రాంతాలకు ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ప్రధానపాత్ర పోషించారన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజలను చదువుకునే విధంగా ప్రోత్సహించేందుకు వసతిగృహాలు, పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. భావితరాలకు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి లల్లీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సహాయ బీసీ సంక్షేమాధికారి రామకృష్ణ ఉద్యోగి కారపు సూర్య శివప్రసాద్, డబ్ల్యూహెచ్‌వోలు బహదూర్, వై.కల్పన తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో..

జగ్గంపేటలో..

హ్యాఫ్రీగా!

ప్రయాణం పండగే

వాడపల్లి స్పెషల్‌కు.. 'నో ఫ్రీ'..

వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రత్యేక బస్సుల్లో నో ఫ్రీ. జిల్లావ్యాప్తంగా వాడపల్లికి 22 బస్సు సర్వీసులు వివిధ డిపోల నుంచి నడుపుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 90 బస్సులు వస్తుంటాయి. ఈ బస్సు సర్వీసులన్నింటినీ ప్రత్యేక సర్వీసులుగా పరిగణిస్తూ ఆదేశాలు రావడంతో శనివారం తెల్లవారుజామునే డిపోలకు చేరుకున్న మహిళా భక్తులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. స్పెషల్ సర్వీసులకు టిక్కెట్లు తీసుకోవాలని చెప్పడంతో ప్రయాణికులంతా అవాక్కయ్యారు. వాడపల్లి ఆలయానికి వచ్చిన ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ముందు స్త్రీశక్తి పథకం వర్తించదని బోర్డులు పెట్టారు. వాడపల్లి ఆలయానికి వెళ్లే మహిళా భక్తులకు ప్రభుత్వం ఫ్రీ సర్వీసు వర్తింపజేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మహిళా భక్తులు కోరుతున్నారు.

(కాకినాడ/అమలాపురం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కేవలం ఆధార్ చూపించి జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించడం సరికొత్తగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చడంతో మహిళలు నీరాజనం పడుతున్నారు. ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం కింద తొలిరోజు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 8,283 మంది మహిళలు ఉచితంగా ఐదు రకాల ఫ్రీబస్సుల్లో ప్రయాణించారు. అది కూడా శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల్లోపు. అంటే కేవలం తొలిరోజు కేవలం ఏడు గంటల వ్యవధిలో 8,283 మంది రికార్డుస్థాయిలో ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవడం విశేషం. రెండో రోజైన శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 వేల మంది వరకు ఫ్రీగా ప్రయాణించినట్టు అంచనా. ప్రస్తుతం వరుస సెలవులు కావడంతో ఉచిత బస్సు ప్రయాణానికి రద్దీ అంతంతమాత్రంగానే ఉంది. సోమవారం నుంచి లక్షల్లో ప్రయాణిస్తారని అధికారులు అంచనా వేశారు.

- స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్
- ఉమ్మడి జిల్లాలో భారీ స్పందన
- ఫస్ట్ డే 8,283 మంది ప్రయాణం
- శనివారం 36 వేల మంది రాకపోక
- సెలవులు కావడంతో తక్కువ రద్దీ
- సోమవారం నుంచి కిటకిట
- 1.90 లక్షలకు పెరగొచ్చని అంచనా
- ఆర్టీసీ అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు
- వాడపల్లి స్పెషల్ బస్‌లకు టిక్కెట్

ఫ్రీ బస్సు కావాలి..

సామర్లకోట/కిర్లంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభించిన స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కొన్ని గ్రామాలకు అక్కరకు రాలేదు. సామర్లకోట మండలంలోని సుమారు 11 గ్రామాలకు అసలు ఎర్ర బస్సు సదుపాయమే లేదు. ఈ కారణంగా ఆయా గ్రామాలకు చెందిన మహిళలు మరికొంతదూరం ప్రైవేట్ వాహనాల్లో సొంత సొమ్ములు వెచ్చించి ప్రయాణించిన తర్వాతే ఉచిత ఆర్టీసీ ప్రయాణ సదుపాయం అందుకోగలరు. జిల్లా కేంద్రానికి కేవలం 10 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్న 11 గ్రామాలకు ఆర్టీసీ బస్సుల రాకపోకలు గత కొన్నేళ్లుగా రద్దుపరిచిన జాబితాలోకి చేరాయి. వాటిలో బోయినపూడి, ఉండూరు, కాపవరం, పీ.వేమవరం, అచ్చంపేట, కొప్పవరం, గొంచాల, నవర, రావువారి చంద్రంపాలెం, పనసపాడు, పంద్రవాడ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తున్న గ్రామాలకు చేరుకోవాలంటే రానుపోను రూ.40 నుంచి రూ.100 వరకూ వెచ్చించాలి. తమ గ్రామాలకు కూడా ఉచిత సర్వీసులు నడపాలని ఆ ప్రాంతాల మహిళలు కోరుతున్నారు. ఇక కిర్లంపూడి నుంచి చిల్లంగి, గెద్దనాపల్లి, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, తామరాడ, గోనేడ మీదుగా జగ్గంపేట ఆర్టీసీ డిపోకు, వేలంక, పెద్దాపల్లి మీదుగా యర్రవరం, ఏలేశ్వరం డిపోకు, రాజుపాలెం, వీరవరం, రామచంద్రపురం గ్రామాల మీదుగా కాకినాడ డిపో, కిర్లంపూడి నుండి పిఠాపురం డిపోకు బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు. గతంలో ఈ గ్రామాల మీదుగా బస్సులు తిరిగేవని సాగించేవని చెబుతున్నారు.

సూపర్ హిట్ పథకం..

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా టీడీపీ ఇచ్చిన ఉచిత బస్సు పథకం శుక్రవారం నుంచి అమల్లోకి రావడంతో మహిళాలోకం సంబరాలు చేసుకుంటోంది. మహిళలు తమ ఆధార్‌కార్డులు చూపించగా గమ్యస్థానం ఆధారంగా టికెట్ ఛార్జీని ప్రస్తావిస్తూ కండక్టర్లు జీరోఫేర్ టికెట్ అందించారు. కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం, కాకినాడ, తుని మూడు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పన్నెండు వరకు మొత్తం 2,507 మంది మహిళలు ఉచితంగా వివిధ బస్సుల్లో ప్రయాణించారు. వీరిలో 48 మంది చిన్నారులు ఉన్నారు. అత్యధికంగా కాకినాడ డిపోలో 1009, ఏలేశ్వరం డిపోలో 595, తుని డిపో పరిధిలో 903 మంది మహిళలు ఫ్రీ ప్రయాణం ఉపయోగించుకున్నారు. వీరందరికి కలిపి చార్జీల రూపంలో రూ.95,667 ఫ్రీగా అమలైంది. కోనసీమ జిల్లాలో నాలుగు డిపోల్లో కలిపి తొలిరోజు 3,431 మంది ఉచితంగా ప్రయాణించారు. వీరిలో 94 మంది చిన్నారులు ఉన్నారు. అత్యధికంగా రావులపాలెం డిపో పరిధిలో 1,373, రామచంద్రపురం డిపో పరిధిలో 912, అమలాపురం డిపోలో 725, రాజోలు పరిధిలో 421 మంది ప్రయాణించారు. తద్వారా రూ.1.06 లక్షల టికెట్ చార్జీలు జీరో ఫేర్ టికెట్ కింద జారీ అయ్యాయి. అటు తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో 2,345 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. అత్యధికంగా మహిళలు రాజమహేంద్రవరం డిపోలో ప్రయాణించారు.

విద్యార్థినులకు ఊరట..

కాలేజీలకు వెళ్లే విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకొకసారి రూ.605 చెల్లించి ఆర్టీసీ నుంచి బస్ పాస్‌లు తీసుకునే వారమని.. ఉచిత బస్సు ప్రయాణ నిర్ణయం వల్ల ప్రయోజనం చేకూరిందని వేమగిరికి చెందిన విద్యార్థినులు నిహారిక, రేష్మ, సంధ్య, ధవళేశ్వరానికి చెందిన సాహితీ తెలిపారు. తూర్పుగోనగూడెంకు చెందిన తోట సత్యవతి, కండిక బుల్లెమ్మ, టి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ తాము నెలకోసారి ఇస్కాన్ టెంపుల్‌కు వస్తామని, బస్సు టికెట్ రూ.30 ఉందని, ఆటో రూ.40 తీసుకునేవారని చెప్పారు. ఇవాళ ఉచితంగా ప్రయాణించామని, చాలా సంతోషంగా ఉందన్నారు. కొందరు ఉద్యోగులు మాత్రం నెలకు రూ.3 నుంచి రూ.4 వేలు ఖర్చు అయ్యేదని.. అది ఇవాళ మిగిలినట్టేనని ఆయా ఉద్యోగులు చెప్పడం గమనార్హం.

గుర్తింపుకార్డులేక..

రాజోలు నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ప్రయాణికుల్లో ఎక్కువ మంది ఉచిత ప్రయాణం చేశారని ఒక కండక్టర్ తెలిపారు. 10 మంది గుర్తింపు కార్డులేక టికెట్లు తీసుకున్నారని.. వారికి తాము ఉచిత ప్రయాణం గురించి వివరించామన్నారు. ఇటువంటి పరిస్థితి అన్నిరూట్లలో కనిపించింది.

సోమవారం నుంచీ..

పథకం రెండో రోజైన శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రతిరోజు అర్ధరాత్రి 12 దాటిన తర్వాత ఆ రోజు మొత్తం జీరోఫేర్ టికెట్లు ఎన్ని జారీచేశారో లెక్కించి తద్వారా ఆరోజు ఫ్రీ బస్సు ప్రయాణాలెన్ని అనేది అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు. శనివారం ఒక్క కాకినాడ జిల్లాలోనే 11,500 మంది వరకు మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం సెలవులు ఉన్న నేపథ్యంలో ఫ్రీ బస్సు ప్రయాణాలకు రద్దీ భారీ స్థాయిలో ఉండడం లేదని.. దీంతో ఆర్టీసీ సిబ్బందికి కొంత ఉపశమనం కలిగినట్టు అధికారులు చెబుతున్నారు. సోమవారం నుంచి ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకునే మహిళలు భారీ స్థాయిలో పెరుగుతారని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి సరాసరి రోజుకు 1.90 లక్షల మందికిపైనే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసే అవకాశం ఉందని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



నేడో..రేపో!

- డీఎస్సీ మెరిట్ జాబితా ఛాన్స్
- 18న పక్కా అంటూ ప్రచారం
- సర్టిఫికెట్ల పరిశీలన బృందాలు
- ఉమ్మడి జిల్లా పోస్టులు 1241
- పరీక్షలు రాసింది 38,617

మెగా డీఎస్సీ మెరిట్ జాబితా, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్ ఎప్పుడు విడుదలవుతుందా? అని అభ్యర్థులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఫలితాలకు సంబంధించి ప్రాథమిక, ఫైనల్ కీ విడుదలైనా మెరిట్ జాబితా విడుదలపై అభ్యర్థులు ఆత్రుతగా ఉన్నారు. వాస్తవానికి ప్రభుత్వం శనివారం (16) నుంచి విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రకటించినా.. నార్మలైజేషన్ ప్రక్రియ, టెట్ మార్కుల వెరిఫికేషన్ ప్రక్రియతో ఆలస్యం అవుతోందని భావిస్తున్నారు. ఓ పక్క మెరిట్‌లిస్టు నేడో, రేపో విడుదల అవుతోందంటూ సోషల్ మీడియాలో కొందరు వైరల్ చేస్తుంటే.. మరోపక్క జిల్లాల వారీగా వాట్సాప్ గ్రూపుల్లో ఆయా కేటగిరీల వారీగా తమ మార్కులను బేరీజు వేసుకునే పనిలో బిజీగా ఉన్నారు.

- కాకినాడ/ఆంధ్రజ్యోతి

- వివరాలు 7లో



ఎంతో ఆనందంగా ఉంది

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది. దీంతో మాకు ఆర్థిక భారం తప్పింది. బస్సుల సంఖ్య కూడా పెంచాలి. సామర్లకోటకు ఒక బస్సు మాత్రమే ఉంది. రాజమహేంద్రవరం వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సి వస్తోంది. - **గేదెల భవాని, చిట్టోడితోట, పిఠాపురం**



మాట నిలబెట్టుకున్నారు..

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన మహిళలకు ఉచిత బస్సు సదుపాయం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి అమలుచేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. - **సి.అనంతలక్ష్మి, తుని**



దారి ఖర్చులు మిగిలాయి..

వ్యవసాయ, రొయ్యలు, కూలి పనుల కోసం రోజూ 30 నుంచి 40 కిలోమీటర్లు ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తా. వచ్చే ఆదాయంలో చాలావరకు దారి ఖర్చులకే అయిపోయేది. ఇప్పుడు చంద్రబాబు స్త్రీశక్తి పథకం ద్వారా నెలకు వేలాది రూపాయలు మిగులుతాయి. - **ఇంటిబోయిన మేరీ, కార్మికురాలు ప్రత్తిపాడు**



చాలా మేలు జరిగింది..

ఇప్పటివరకు తూర్పులక్ష్మీపురం నుంచి సీజన్ టికెట్ తీసుకుని ఏలేశ్వరం వచ్చేదానిని. నెలవారీ సీజనల్ టికెట్ రూ.700 ఖర్చు అయ్యేది. ఆ సొమ్ము వెచ్చించడానికి ఇబ్బందిగా ఉండేది. ఉచితంగా బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించినందుకు రుణపడి ఉంటాం. - **బంక సూర్యావతి, విద్యార్థిని, ఏలేశ్వరం**

నెలకు నాలుగు వేలు మిగులు

జగ్గంపేట పరిసరాల నుంచి కొంతమంది యువతులం రోజూ కొవ్వూరు వెళతాం. అక్కడ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తాం. ఇక్కడ నుంచి రాజమండ్రి వెళ్లి అక్కడ నుంచి కొవ్వూరు వెళతాం. రోజుకి రూ.160 ఖర్చు. పాస్ తీసుకుంటే రూ.4 వేలు. ఈ ఉచిత బస్సు వల్ల ఆ మొత్తం మాకు కలసి వస్తుంది. - **పూలమాటి కమలకుమారి, కొవ్వూరు**

మళ్లీ పెరుగుతున్న సుద్దగడ్డ వరద



గొల్లప్రోలు పట్టణ శివారు ముంపులో ఉన్న వరి పొలాలు

పొంగుతున్న సుద్దగడ్డ వాగు

- ముంపులోనే పంటపొలాలు
- కుళ్లుతున్న వరి, పత్తి పంట

గొల్లప్రోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ వరద మళ్లీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ (కొండ)కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం తెల్లవారుజాముకు తగ్గినట్టు కనిపించిన వరద మధ్యాహ్నం నుంచి పెరగడం ప్రారంభమైంది. దీంతో పాటు చౌటు కాలువకు వరద నీరు పోటెత్తింది గొల్లప్రోలు పట్టణ శివారులోని కొత్తకాలనీకి వెళ్లే ప్రత్యామ్నాయ రహదారి, సూరంపేటకు వెళ్లే రోడ్లపై వరద నీరు ప్రవహిస్తోంది. కొత్తకాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని నిచ్చెన వేసి దాటడం ద్వారా కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. సూరంపేట వద్ద వరద నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, తాటిపర్తి, చెందుర్తి తదితర గ్రామాల్లో వరి, పత్తి పంటలు ముంపులో చిక్కుకున్నాయి. పలు చోట్ల వరి నాట్లు, పత్తి పంట కుళ్లిపోతున్నట్టు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వరద నీరు పెరగుతుండడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.



చెందుర్తిలో నీట మునిగిన పత్తి పంట

వరద ముంపు జగన్ నిర్వాకమే : వర్మ

టీడీపీ హయాంలో తాము మంజూరు చేయించిన, జరుగుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులను నాడు జగన్ సర్కారు అర్థంతరంగా రద్దు చేయడం వలనే ప్రస్తుతం వరద ముంపు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. ఇదంతా జగన్ నిర్వాకమేనని మండిపడ్డారు. గొల్లప్రోలు పట్టణ శివారు కొత్తకాలనీ వద్ద వరద పరిస్థితిని, ముంపునకు గురైన పొలాలను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా పిఠాపురం నియోజకవర్గం తీవ్రం నష్టపోతున్నదన్నారు. దీనిపై దశాబ్దకాలంగా టీడీపీ ఆధ్వర్యంలో పోరాటం సాగించగా 2018లో ఆధునీకరణకు సీఎం చంద్రబాబు రూ.160 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారని తెలిపారు. రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఈ పనులను రద్దు చేసి కనీసం తిరిగి మంజూరు కూడా చేయలేదని విమర్శించారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.కూటమి ప్రభుత్వంలో ముంపు బెడద శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.ఆయన వెంట టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగర పంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, బస్సా సత్యనారాయణ పాల్గొన్నారు.



అక్రమాలకు అడ్డుకట్ట

- ఉపాధి శ్రామికులకు
- రెండు పూటలా మస్టర్
- ముఖ ఆధారిత హాజరు
- తప్పనిసరి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం పటిష్ఠ చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పనుల నిర్వహణ, శ్రామికుల మస్టర్ల నమోదులో కొత్త యాప్‌లు అమలు చేస్తుండగా తాజాగా శ్రామికులకు ఇకపై రెండు పూటలా మస్టర్ నమోదు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ ముఖ ఆధారిత హాజరు విధానం ద్వారా ఒక శ్రామికుడు రెండు, మూడుచోట్ల వేర్వేరు పేర్లతో హాజరు వేయించుకునే వీలుండదు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న జాబ్‌కార్డు కలిగిన శ్రామికులు కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆయా మస్టర్ల ఆధారంగానే కూలీలకు వేతనాలు చెల్లిస్తారు. ముఖఆధారిత హాజరు విధానంలో భాగంగా శ్రామికుల ప్రతిఒక్కరి ఫొటో మొబైల్‌లో ముందుగా తీసి జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ సమయంలో ఒకరి తరఫున మరొకరు హాజరైతే అలాంటి వారి ఫొటోను యాప్ అనుమతించదు. దీనివల్ల ఆన్‌లైన్‌లో హాజరు వేయడం ఏవిధంగానూ సాధ్యం కాదు.



అవకతవకలు సరిదిద్దేందుకు..

వైసీపీ హయాంలో దొంగ మస్టర్ల బాగోతం పెద్దఎత్తున సాగింది. శ్రామికుల హాజరు పేరుతో అవినీతి సాగేది. అప్పట్లో ఆ పార్టీ నేతలు, క్షేత్రస్థాయి సిబ్బంది కలిసి దొంగ మస్టర్ల ద్వారా దోచేశారు. మృతి చెందిన వారి పేర్లతోను వేతనాలు డ్రా చేసిన ఘటనలూ ఉన్నాయి. వీటన్నింటినీ నివారించడమే లక్ష్యంగా కేంద్రం శ్రామికుల హాజరు విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. గతంలో ఎన్ఎంఎంఎస్ ద్వారా ఉదయం, మధ్యాహ్నం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసేవారు. ఈ విధానంలో కూలీలు ఒక పూట పనిచేసి రెండుపూటలా పనిచేసినట్టు నమోదు చేసుకునేవారు. దీంతో సామాజిక తనిఖీలు జరిగినప్పుడు మస్టర్ల లోపాలు ఉండడంతో క్షేత్ర సహాయకులు జరిమానాలు విధించేవారు. ఇప్పటికే పలు మండలాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలు, ప్రజావేదికల్లో రికవరీలు, జరిమానాలు విధించేవారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ నూతన విధానంలో ఇకపై ఈ ఆటలు, అక్రమాలు సాగవు.

ఇకపై ఇలా చేస్తారు

పనిచేసే ప్రదేశంలో ఉదయం తొమ్మిది గంటలు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే ఫొటోలు తీయాలి. వాటిని రెండుసార్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోలకు నివేదిక పంపుతారు. ఇలా అన్ని గ్రామాల నుంచి వచ్చిన సమాచారంతో 20 శాతం ఫొటోలను ఇప్పటివరకు 15 రోజులు మాత్రమే భద్రపరిచే విధానం ఉండేది. ఇకపై జిల్లా అధికారులు శాశ్వత పద్ధతిలో భద్రపరుస్తారు. వచ్చేవారం నుంచి క్షేత్ర స్థాయిలో కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయనున్నారు. జిల్లాలోని 21 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 2,88,267 జాబ్ కార్డులు ఉన్నాయి.

అంబయ్యా.. అదిరిందయ్యా



● జాజికాయ, జాపత్రి సాగులో రాణిస్తున్న యండపల్లి రైతు 6

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా సానా సతీష్‌బాబు ఏకగ్రీవం 6

సత్యదేవుడి సన్నిధిలో ఉచిత బస్సు ప్రారంభం 7

అంబయ్యా.. అదిరిందయ్యా!



- జాజికాయ, జాపత్రి సాగులో రాణిస్తున్న యండపల్లి రైతు
- సుమారు పదేళ్ల క్రితం అంతరపంటగా సాగు..
- నేడు ఏపుగా కాపు కాస్తున్న కాయలు..
- స్థానిక వ్యాపారులకు విక్రయం

(కాకినాడ, యు.కొత్తపల్లి-ఆంధ్రజ్యోతి)

జాజికాయ, జాపత్రి మార్కెట్లో డిమాండ్ ఉన్న ఐటమ్.. కేరళలో మాత్రమే కనిపించే ఈ పంటను.. మన కాకినాడ జిల్లాలోనూ ఓ రైతు సుమారు పదేళ్లుగా అంతరపంటగా సాగుచేస్తున్నారు. ఆయన వేసిన పంట ఆశాజనకమైన దిగుబడి ఇస్తుండడంతో ఆయన ప్రయత్నం ఫలప్రదమైందని చెప్పొచ్చు. ఈనేపథ్యంలో ఆయనపై ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేకకథనం..

తనకున్న భూమిలో ఆ రైతు అరటి సాగు వేసేవారు.. అరటి తోటలు తుఫాన్లకు, ఈదురు గాలులకు దెబ్బతిని కూలిపోతుండడంతో నష్టం వాటిల్లేది. ఇక లాభం లేదనుకున్న ఆయన పామాయిల్ సాగుపై మొగ్గుచూపారు. చెట్లు పెద్దగా పెరగడంతో అంతరపంటగా కోకో వేశారు. ఆ పంటను కోతులు పాడు చేస్తుండడంతో ఆ పంటను కూడా విరమించుకున్నారు. ఓ రోజు పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ రైతు జాజికాయ, జాపత్రిని అంతరపంటగా వేశారని తెలిసి చూసేందుకు వెళ్లారు. అక్కడ చెట్లు ఏపుగా పెరిగి కాయలు కాస్తుండడాన్ని గమనించి కడియపులంకలో జాజి మొక్కను వేశారు. అది కాస్తా ఫలప్రదం కావడంతో తనకున్న 20 ఎకరాల్లో అరుదైన జాజికాయ, జాపత్రిని సాగు చేస్తున్నారాయన. వాస్తవానికి ఒకే చెట్టు కాయ నుంచి జాజికాయ, జాపత్రి వస్తాయి. మార్కెట్లో వీటికి డిమాండ్ ఎక్కువ.

అరటిలో నష్టంరావడంతో...

కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం యండపల్లి గ్రామానికి చెందిన గంధ్ర అంబయ్య 20 ఎకరాల ఆసామి.. వివిధ రకాల పంటలను సాగు చేస్తుంటారు. ప్రధాన పంటగా ప్రస్తుతం ఆయన పామాయిల్ సాగు చేస్తున్నారు. మొదట్లో ఆయన అరటి పంట వేయగా.. అది తుఫాన్లకు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేది. దీంతో నష్టాలబారిన పడిన ఆయన తర్వాత పామాయిల్ సాగు వేశారు. పామాయిల్ చెట్ల మధ్య ఖాళీలో అంతరపంటగా కోకో వేసినా.. ఆ పంటను కోతులు పాడుచేసేవి. దీంతో ఆయన జాజికాయ, జాపత్రిలను వేశారు.

అంతరపంటగా జాజికాయ సాగు

సాధారణంగా ఈ పంట మనప్రాంత భూముల్లో పండడం అరుదు. ఎక్కువగా కేరళ వంటి చల్లదనం ఉన్న ప్రాంతాల్లో పండుతాయి. ఈ నేపథ్యంలో 2016లో తొలుత కడియపులంక నుంచి దేశివాళీ జాజికాయ మొక్కలు ధర రూ.200 చొప్పున కొనుగోలు చేసి అంబయ్య



తన తోటలో నాటారు. ఆ మొక్కలు ఏపుగా పెరుగుతుండడంతో.. నేల అనుకూలంగా ఉందని భావించిన ఆయన మరికొన్ని హైబ్రీడ్ మొక్కలను మొక్క ఒక్కొక్కటి రూ.400 చొప్పున కేరళ నుంచి రప్పించారు. ముందుగా వేసిన దేశీవాళీ మొక్కలు ఆరేళ్లకే కాపునకు రాగా, రెండేళ్ల తర్వాత వేసిన హైబ్రీడ్ మొక్కలు నాలుగేళ్లకే కాపు కొచ్చాయి. రెండూ ఒకేసారి కాపునకు రావడంతో రైతు అంబయ్య పంట పండింది. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే దేశీవాళీ మొక్క పదడుగుల ఎత్తు ఎదిగాక కాపుకొస్తే.. హైబ్రీడ్ మొక్క నాలుగైదు అడుగుల ఎత్తులోనే కాయలు కాసేవి. తొలుత దేశీవాళీ మొక్కలు 10, హైబ్రీడ్ మొక్కలు ఆరు తీసుకొచ్చిన అంబయ్య ప్రస్తుతం వందలాది మొక్కలను నాటారు. ఒక మొక్క పూర్తిస్థాయిలో ఫలాలను అందించాలంటే పదేళ్ల సమయం పడుతుందని రైతు అంబయ్య అంటున్నారు. దేశీవాళీ కాయ సైజు చిన్నగా, హైబ్రీడ్ పెద్దగా ఉంటున్నాయంటున్నారు. అలాగే దేశవాళీ దిగుబడి అధికంగా ఉంటే, హైబ్రీడ్‌లో కాయల దిగుబడి తక్కువగా ఉంటుందన్నారు.

నీడనిచ్చే వాతావరణం..

సాధారణంగా ఈ జాజికాయ, జాపత్రి పంటను నీడన మాత్రమే వేసుకోవాలి. 30 డిగ్రీల వాతావరణంలో తోట పంటలుగా వేస్తేనే మొక్కలు బాగా ఎదుగుతాయి. లేకుంటే చనిపోతాయి. అలాగే పామాయిల్‌తోపాటు కొబ్బరిలో అంతరపంటగానూ వేసుకోవచ్చు. రెగ్యులర్‌గా నీటితడులు ఇచ్చుకుంటే సరిపోతుంది.

దిగుబడి ఇలా..

ప్రస్తుతం రైతు అంబయ్య తోటల్లో వేసిన జాజికాయ, జాపత్రిచెట్లు ఒక్కో చెట్టు సుమారు వందకాయలు కాస్తోంది. వీటిలో అనేక రకాల మొక్కలు ఉన్నాయని కేరళలోని రీసెర్చ్ సెంటర్లో కేరళ శ్రీ, విశ్వశ్రీ, నోవా, కింగ్, కౌపుత్రా, పునాపున్ పేరుతో అందుబాటులో ఉంచారని అంటున్నారు. తాను మాత్రం దేశివాళీ, విశ్వశ్రీని తీసుకొచ్చానంటున్నారు. ప్రస్తుతం తన వద్ద పండిన పంటను కిరాణా షాపుల వారికి విక్రయిస్తున్నట్టు రైతు అంబయ్య చెబుతున్నారు. కిలో మేస్(జాపత్రి) ధర రూ.2500కు, జాజికాయలు రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

ఎందుకు వాడతారంటే..

జాజికాయ అనేది పండు లోపల ఉండే గింజ, జాపత్రి అంటే ఆగింజను కప్పి ఉంచే ఎర్రటి పొర.జాజికాయలను సుగంధ ద్రవ్యంగా ఉపయోగిస్తారు. అలాగే ఆయుర్వేదంలో కూడా పలు అనారోగ్య సమస్యలకు ఔషధంగా వాడతారు. జాజికాయ జీర్ణక్రియను మెరుగుపరచడానికి, నిద్రలేమిని తగ్గించడానికి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

మిరియాలు, వక్క కూడా..

ప్రస్తుతం రైతు అంబయ్యతోటలో వక్క, మిరియాలు వంటి వాటిని అంతర పంటగా సాగు చేస్తున్నారు. అవి కూడా మరికొన్ని నెలల్లో సాగుకు వచ్చే అవకాశం ఉందని ఆయన చెబుతున్నారు. కేవలం తన సొంత పరిజ్ఞానంతోనే ఈ సాగు చేపట్టానని, ఉద్యానశాఖాధికారుల నుంచి ఎటువంటి సూచనలు తీసుకోలేదని ఆయన తెలిపారు.

సేంద్రియ విధానంలోనే సాగు

\- గంధ్ర అంబయ్య, రైతు, యండపల్లి, యు.కొత్తపల్లి



నేను, నాకున్న ఎకరాల్లో వందలాది మొక్కలు వేశాను. పూర్తిగా సేంద్రియ విధానంలోనే సాగు చేస్తున్నాను. పంట పూర్తి లాభదాయకంగానే ఉంది. పామాయిల్ తోటల్లో మూడు చెట్లకు మధ్యలో మొక్కలు నాటితే దిగుబడి బాగుంటుంది. మొక్కకి మొక్కకి మధ్య 20 అడుగుల దూరం ఉండాలి. ఎకరానికి 50 మొక్కలు వేశాను. ఈ మొక్క సుమారు వందేళ్ల పాటు బతుకుతుంది. పదేళ్ల తర్వాత దిగుబడి అధికమవుతుంది. ఈమొక్కల్లో మేల్, ఫిమేల్ రెండూ ఉన్నాయి. మెడిసిన్ ప్లాంట్ కావడంతో తెగుళ్ల బెడద పెద్దగా ఉండదు. మిగిలిన పంటకంటే వీటి ద్వారా ఆదాయం బాగుంది.

ముకుందా..ముకుందా!

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమిఘాట్‌లో ఉన్న ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం యజ్ఞసేవ, మధ్యాహ్నం ఇస్కాన్ నిర్వహించిన పోటీలో గెలుపొందిన 300మంది విద్యార్థులకు జర్మనీ దేశం నుంచి వచ్చిన శ్రీకృష్ణ భక్తుడు సనత్‌నాథన్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మధ్యాహ్నం ఉట్టి ఉత్సవం,సాయంత్రం విశ్వశాంతి యజ్ఞం, వాహన సేవలు, శ్రీకృష్ణ లీలా ప్రవచనాలు, తెప్పోత్సవం, రాత్రి కుంబాభిషేకం జరిగింది. 2006లో సరిగ్గా బలరామ జయంతినాడు, రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరాన్ని ప్రారంభించామని రవీంద్ర చైతన్య హిమా నిమాయిదాస్ తెలిపారు.



రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు





రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ మందిరం వద్ద ఉట్టికొడుతున్న దృశ్యం, అమలాపురంలోని ఓ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

సత్యదేవుడి సన్నిధిలో..

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కళామందిరంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులనుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకస్వాములు గోపూజ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈవో సుబ్బారావు దంపతులతోపాటుగా అధిక సంఖ్యలో భక్తులు గోపూజలో పాల్గొన్నారు. శ్రీగోకులంలో ఉన్న కృష్ణభగవానుడికి విశేషపూజలు నిర్వహించారు. రాత్రి 8గంటలకు కొండపై రామాలయం, తొలిపావంచావద్ద యాదవసామాజిక వర్గం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమంనిర్వహించారు.



అన్నవరం ఆలయప్రాంగణంలో ఉట్టికొడుతున్న భక్తులు



కాజులూరు మండలం గొల్లపాలెంలో ఉట్టికొడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్



శ్రీకృష్ణుడు వేషధారణలో చిన్నారులు



వెన్న కోసం ఉరకలేస్తున్న బాలుడు

గోదావరి తీరాన మార్మోగిన శ్రీహరినామ సంకీర్తన

పి.గన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీపట్టాభి రామస్వామి ఆలయ సన్నిదిలో గరుడవేగ టీమ్, రామసేతు భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై శ్రీపట్టాభిరామస్వామి ఆలయ సన్నిదిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపానికి తీసుకుని వచ్చారు. మహిళలు పసుపు, చందనంతో కలశపాత్రలో తీసుకువచ్చిన జలాలను స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు అనంతరం శ్రీశ్రీశ్రీ సాయిదత్త నాగానంద సరస్వతి స్వామి భక్తులకు ప్రవచనాలను వినిపించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.



పిగన్నవరంలో లడ్డూగోపాలుడు, రాధాకృష్ణుడు, సుదర్శనమూర్తిలకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.62.78లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాత సేవ,నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.62.78 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలయ తిరువీధుల్లో భక్తుల రద్దీ

ఉధృతమవుతున్న గోదావరి

4.25 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రవాహంలో కురుస్తున్న వర్షాల వల్ల ఉప నదులు ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద 24గంటల వ్యవధిలో 1.75 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పెరిగింది.శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలీ, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1మీటరు మేర, విజ్జేశ్వర ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను అరమీటరు మేర పైకెత్తి 4,25,5 94 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను మరింత తగ్గించారు. తూర్పు డెల్టాకు 2వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 500క్యూసెక్కులు చొప్పున మొత్తం 2700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం సాయంత్రానికి 29.60 అడుగులకు చేరుకుంది.

ప్రభుత్వ బడి చిన్నారులు.. ఆంగ్లంలో దిట్టలు



ఆంగ్లంలో ప్రసంగిస్తున్న భావనరాజి, సుహాన

సామర్లకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంచాల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ముమ్మిడి భావనరాజి, ఈది సుహానాలు కలిసి చేసిన ఆంగ్ల ప్రసంగం పలువురు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆకట్టుకుంది. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా రెండున్నర నిమిషాల పాటు గుక్క తిప్పుకోకుండా ఇద్దరూ ఆంగ్లంలో ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవం, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యామిత్ర కిట్‌ల పంపిణీ, ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును ఈ సందర్భంగా వివరించారు. కాగా చిన్నారులకు ఆ రీతిలో ఆంగ్లంలో ప్రసంగం చేసేలా శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకులైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎస్ఎన్ మూర్తిని పలువురు గ్రామస్థులు అభినందించారు.



ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా

సానా సతీష్‌బాబు ఏకగ్రీవం

కాకినాడసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఎన్నికైన ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు శనివారం మంగళగిరిలో రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నియామకపత్రం అందజేశారు.సతీష్‌బాబును బీసీసీఐ కార్యదర్శి జయ్‌షా ప్రత్యేకంగా అభినందించారు.అలాగే ఆయనను ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, క్రికెట్ అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మందపల్లి శనేశ్వరస్వామికి

ప్రత్యేక పూజలు

కొత్తపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు.ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,91,581 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

ఉత్కంఠభరితంగా

బాస్కెట్‌బాల్ పోటీలు



పిఠాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 10వ రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజు శనివారం ఉత్కంఠభరింతంగా జరిగాయి. బాలబాలికల విభాగాల్లో సెమీఫైనల్స్‌లో బెర్త్ కోసం 13 ఉమ్మడి జిల్లా జట్లు మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు భారీగా వచ్చారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి, పిఠాపురం బాస్కెట్ బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- పేదరికం తగ్గితే కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల చీలిక వల్ల రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే తీవ్రంగా నష్టపోయాం, ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు మరింత సమర్థవంతంగా, సమరశీలంగా పనిచేయాలంటే కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలని పిలుపునిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. దేశంలో ప్రధానమైన కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ, సీపీఎం మరింత ఐక్యతతో ముందుకు సాగాలని అనుకుంటున్నామని వ్యాఖ్యానించారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 25శాతం పేదరికం తగ్గించామని ప్రధాని నరేంద్రమోదీ గొప్పగా చెప్పుకుంటున్నారని, ఒక వేళ దేశంలో అంత పేదరికమే తగ్గితే ఉచితంగా అన్ని కోట్ల మందికి బియ్యం, గోధుమలు వంటివి ఎందుకిస్తున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో అదానీ, అంబానీలు, కోటీశ్వరులను పోషిస్తున్నారు తప్ప పేదరికం తగ్గలేదని, వారి జీవన ప్రమాణాలు పెరగలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను మోసం చేస్తున్నాయని, పోలవరం సమస్యలపై దశల వారీ ఉద్యమం చేస్తామన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తామని మోదీ చెబుతుంటే దానికి సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం ఏమిటని అన్నారు. తాము ప్రస్తుతం పేద, బలహీన వర్గాల వారికి ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తున్నామన్నారు. మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నట్టేట ముంచారని, ఎవరికి ఉద్యోగాలిచ్చిన పాపాన పోలేదన్నారు. నిరుద్యోగభృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా అమలు చేయకపోతే తాము ఉద్యమించకతప్పదని అన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కె.రాంబాబు, వి.కొండలరావు, సప్ప రమణ, పి.లావణ్య, అల్లం వెంకటేశ్వరరావు, సీహెచ్ సునీల్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఇందుకూరు సభలో మాట్లాడుతున్న ఎంఏ బేబీ

- లేకుంటే ఉద్యమిస్తాం
- సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి బేబీ
- పోలవరం నిర్వాసిత ముంపు ప్రాంతాల్లో పర్యటన

దేవీపట్నం/కూనవరం/కోరుకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హెచ్చరించారు. శనివారం పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన ఆయన తొలుత మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కేంద్ర కమిటీ సభ్యుడు బి.లోకనాథం, సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్ ఇతర నాయకులు స్వాగతం పలికారు. అక్కడ ఆయన గిరిజన సాంప్రదాయంలో భాగమైన కొమ్మును బేబీ తలపై ధరించారు. అనంతరం కొద్దిసేపు నాయకులతో మాట్లాడి అక్కడ నుంచి దేవీపట్నం బయల్దేరారు. తాళ్లూరు, నాగులపల్లి పునరావస కాలనీలో పర్యటించారు. అనంతరం ఇందుకూరు వన్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.పోలవరం ప్రాజెక్టు కారణంగా వేల కుటుంబాలు మునిగిపోతున్నాయన్నారు. నిర్వాసితుల్లో 85శాతం మంది ఆదివాసీలు ఉన్నారన్నారు. పోలవరం నిర్వాసితులందరికీ గౌరవప్రదమైన పునరావాసం కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వంపై ఉందని, కానీ సుదీర్ఘకాలంగా పూర్తి నిర్లక్ష్యం జరిగినట్టు స్పష్టమవుతోంది. నిర్మాణాల్లో నాణ్యత లోపం కారణంగా వర్షాలకు శ్లాబుల నుంచి నీళ్లు కారిపోతున్నాయని, మరుగుదొడ్లు కూడా సక్రమంగా నిర్మించలేదని, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.ఉపాధి కోసం ప్రతిరోజు 30 నుంచి 40 కిలోమీటర్లు నడకన వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ నిర్మించినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాస గృహాలకు అర్హులైనవారు సైతం దూరమయ్యారని వివరించారు. వీటిపై ప్రభుత్వం స్పందించాలని బేబీ డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పరిశీలిస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. ప్రజల సమస్యలు విన్నవించుకునేందుకు నోడల్ అధికారి సైతం అందుబాటులో లేరని విమర్శించారు.

జెండాలు పీకేస్తాం

అఖిలపక్షం నాయకులు

కూనవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం తీసుకున్న రైతుల భూములలో పాతిన జెండాలను అధికారులతో పీకిచ్చేస్తామని అఖిలపక్షం నాయకులు అన్నారు. పరిహారం తీసుకుని స్థానికంగా లేని కొంతమంది రైతుల భూములను పేద గిరిజనులకు పంచుతామని ఇటీవల సీపీఎం గిరిజన సంఘం ఆ భూముల్లో జెండాలు పాతిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు పాయం వెంకయ్య మాట్లాడుతూ సీపీఎం పార్టీ గిరిజనులకు గిరిజన నేతరులకు మధ్య వివాదం సృష్టిస్తోందన్నారు. నీళ్లు వచ్చేంతవరకు భూమి గల రైతులు వ్యవసాయం చేసుకోవచ్చని అప్పటి ప్రభుత్వం పరిహారం ఇచ్చినప్పుడు చెప్పిందని.. ఆ భూములను లాక్కోవడానికి సీపీఎంకు ఏమి హక్కు ఉందని ప్రశ్నించారు. టీడీపీ అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడపల్లి భాస్కరరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. అవసరమైతే ఆదివారం పర్యటించే సీపీఎం కేంద్ర కమిటీతో అక్కడి రైతులు మాట్లాడి సమస్య పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఒకరి భూములు మరొకరు లాక్కోవడం చట్ట విరుద్ధమన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు గడేసులు ప్రేమ్‌చంద్, బీజేపీ చింతూరు నాయకుడు దాసరి రమణరెడ్డి, వైసీపీ నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, అవుల మరియదాసు, ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంజ అనిల్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడో.. రేపో..!

- మెగా డీఎస్సీ మెరిట్ జాబితా విడుదలయ్యే అవకాశం
- అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు బృందాల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం టీచర్ పోస్టులు 1241
- పరీక్షలు రాసింది 38,617 మంది

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

మెగా డీఎస్సీ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి కూటమి సర్కారు శుభవార్త వినిపించినా.. తుది ఫలితాల విడుదల్లో జాప్యంపై గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈనెల ఒకటో తేదీన కీ విడుదల చేసిన విద్యాశాఖ ఈనెల 15లోపు మెగా డీఎస్సీ-2025 ఫలితాలను విడుదల చేస్తామని ఆరోజే ప్రకటించింది. దీంతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే కీ పరిశీలనతో ఓ నిర్ణయానికి వచ్చిన అభ్యర్థులు మెరిట్ జాబితా కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, నెలాఖరునాటికి కొత్త టీచర్ల పోస్టింగులు, శిక్షణ అన్నీ చకచకా జరిగిపోతాయని ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇంకా ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేయకపోవడంపై నిరాశ చెందుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈసారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదులో ముందున్నారు. కేటగిరీల వారీగా ఓసీ-5120, బీసీ-ఏ 2810, బీసీ-బీ 6991, బీసీ-సీ 554, బీసీ-డీ 3636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2572, ఎస్సీ గ్రేడ్-3 10,066, ఎస్టీ 6,213, ఈడబ్ల్యూఎస్ 3,782, అలాగే దివ్యాంగుల కేటగిరీ నుంచి వీహెచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ ఆరుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ ఆరు నుంచి జూలై ఏడు వరకు 26 రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు.

పోస్టుల వివరాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్టీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78, ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామవిద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్-2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 ఉపాధ్యాయపోస్టులు భర్తీ చేయనున్నారు.

జాప్యానికి కారణాలు...

మెరిట్ జాబితా విడుదల్లో జాప్యానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. టెట్ మార్కులను కొందరు అభ్యర్థులు తప్పులతడకలుగా పొందుపరచడం, నార్మలైజేషన్ ప్రక్రియలు, న్యాయస్థానాల్లో ఉన్న అభ్యంతరాలను అధిగమించడం, వరుస సెలవుదినాలు రావడం వంటి పలు కారణాలతో విడుదల ఆలస్యమవుతోందనే ప్రచారం సాగుతోంది. టెట్ మార్కులపై అభ్యంతరాలను స్వీకరించి మారిన మార్కులతో సవరించిన డీఎస్సీ తుది మార్కుల స్కోర్ కార్డులను ఈనెల 14న విడుదల చేశారు. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో మార్కులు ఉంచారు. ఇంకా టెట్ మార్కులపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఆన్‌లైన్‌లో పంపవచ్చని సూచించారు. అలా వచ్చిన వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను ప్రకటించనున్నారు. అయితే ఈనెల 18 నాటికి విడుదలయ్యే సూచనలు అధికంగా కనిపిస్తున్నాయి. అనంతరం మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జిల్లాలో డీఎస్సీ పోస్టులకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరాజు ఆదేశించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రతి 50 మందికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాలో 25 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ఒక ఎంఈఓ, హెచ్ఎం, డిప్యూటీ తహశీల్దార్ ఉండేలా చూశారు.

ఈ సారి పోటీ అధికమే..

డీఎస్సీకి ఈసారి పోటీ అధికంగానే ఉంది. ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ శిక్షణ పొందిన వారు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఎడ్ శిక్షణ పొందిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కూడా పోటీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 వేల నుంచి 40 వేలమంది పోటీ పడనున్నారు. 2018 డీఎస్సీలో ఒక పోస్టుకు 101 మంది పోటీపడ్డారు. ఎస్జీటీలో ఒక్కో ఖాళీకి 101 మంది పోటీపడగా, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఒక్కో పోస్టుకు 124మంది పోటీపడ్డారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పోస్టుల్లో ఒక్కో పోస్టుకు 94 మంది పోటీపడ్డారు. ఆ లెక్కన చూస్తే ప్రస్తుత డీఎస్సీలో పోటీ అధికంగానే ఉందని భావిస్తున్నారు.

ఆ వివరాలు పంపండి..

డీఎస్సీ 2025లో నోటిఫై చేయబడిన పోస్టుల సంఖ్య, మేనేజ్‌మెంట్ వారీగా, కేటగిరీ వారీగా, మీడియం, సబ్జెక్టుల వారీగా వివరాలు పంపాలని ఇప్పటికే డీఈవో, ఆర్‌జేడీలకు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. ఆగస్టు 31, 2025 నాటికి అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్య, డీఎస్సీ 2025లో ఖాళీలను భర్తీ చేయడానికి పాఠశాలలను గుర్తించడం, కేటగిరీ-4/3లో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు, బదిలీ చేయబడిన కానీ, బదిలీ చేసిన, రిలీవ్ కాని ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలు, ఇలా పలు వివరాలు పంపాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు చెబుతున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఉచిత బస్సు ప్రారంభం



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు రత్నగిరి నుంచి సత్యగిరి కొండకు చేరుకునేందుకు అరబిందో ఫార్మా అందజేసిన ఉచిత బస్సును శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా భక్తుల ఇబ్బందులు తెలుసుకుని వాటిని పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు ఆమె స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

సముద్రంలోకి పంపా నీరు విడుదల

98 అడుగుల నీటిమట్టం ఉండేలా చూడాలని ఉన్నతాధికారుల ఆదేశం



వరద గేట్ల ద్వారా పంపా జలాలు విడుదల చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువప్రాంతాల్లో 2 రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంపా రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా పంపా నీటిని వరదగేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేశారు. ప్రస్తుతం నీటిమట్టం 99 అడుగులు ఉండగా 98 అడుగులు నిర్వహణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారని డీఈ సంతోష్‌కుమారు తెలిపారు. ఎగువప్రాంతాల నుంచి 600 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా 600 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

తిరుపతి-విశాఖ మధ్య 14 వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు



సామర్లకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతిల మధ్య సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు సెప్టెంబరు 25 వరకూ 14 వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. 08547 నంబరు గల రైలు విశాఖ-తిరుపతి మధ్య సెప్టెంబరు 24 వరకూ ప్రతీ బుధవారం విశాఖలో బయలుదేరనుంది. అలాగే 08548 నంబరు గల రైలు తిరుపతి-విశాఖల మధ్య సెప్టెంబరు 25 వరకూ ప్రతీ గురువారం తిరుపతిలో బయలుదేరనుంది. 08547 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖలో ప్రతీ బుధవారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరుతుంది. అనకాపల్లి, యలమంచలిల మీదుగా అన్నవరం స్టేషన్‌కు రాత్రి 8.38 గంటలకు చేరుతుంది. సామర్లకోటకు రాత్రి 9.08 గంటలకు చేరుతుంది. రాజమహేంద్రవరానికి 9.53 గంటలకు చేరుతుంది. నిడదవోలు, తణుకు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంటల మీదుగా తిరుపతికి గురువారం ఉదయం 9.15 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ఆగస్టు 20,27, సెప్టెంబరు 3,10,17,24 తేదీల్లో విశాఖ నుంచి 6 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది. 08548 నంబరు గల తిరుపతి-విశాఖల మధ్య వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతిలో ప్రతీ గురువారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరంటౌన్, తణుకు, నిడదవోలుల మీదుగా రాజమహేంద్రవరం స్టేషన్‌కు ఉదయం 6.43 గంటలకు చేరుతుంది. సామర్లకోటకు ఉదయం 7.28 గంటలకు, అన్నవరం స్టేషన్‌కు 7.58 గంటలకు చేరుతుంది. యలమంచలి, అనకాపల్లి, దువ్వాడల మీదుగా విశాఖకు శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటలకు చేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఆగస్టు 21,28 సెప్టెంబరు 4, 11, 18, 25లలో తిరుపతి నుంచి 6 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో సెకండ్ ఏసీ-2 బోగీలు, థర్డ్ ఏసీ-3 బోగీలు, థర్డ్ ఏసీ ఎకానమి-2 బోగీలు, స్లీపర్ క్లాస్‌కు చెందిన 8 బోగీలు, జనరల్ 4 బోగీలు, ఎస్ఎల్ఆర్‌డీ-1, ఈవోజీ-1 చొప్పున మొత్తం 21 ఎల్‌హెచ్‌బీ బోగీలతో విశాఖ-తిరుపతి-విశాఖల మధ్య రాకపోకలు సాగించనుంది. ఈ రైళ్లల్లో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐ.పోలవరంలో అడవిపంది స్వైరవిహారం

నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటరాజారావు

ఐ.పోలవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం, కేశనకుర్రు గ్రామాల్లో శనివారం అడవిపంది స్వైరవిహారం చేసింది. పలువురిని తీవ్రంగా గాయపరిచింది. గాయపడినవారిలో ఐ.పోలవరానికి చెందిన దంగుడుబియ్యం వెంకటరాజారావు, బొలిశెట్టి రాంబాబు, వ్యవసాయకూలీ గుత్తుల త్రివేణీపద్మావతి, దంగేటి వెంకటరెడ్డి ఉన్నారు. తీవ్రంగా గాయపడిన బాధితులను టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దంగుడుబియ్యం వెంకటరాజారావుకు కాలు, చెయ్యి విరగడంతో కాకినాడ తరలించారు. కోటిపల్లి తదితర ప్రాంతాల నుంచి ఇటీవల అడవిపందులు గ్రామాల్లోకి చొరబడుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండుసార్లు మండలంలో అడవిపందులు చొరబడగా హతం చేయడం జరిగిందన్నారు. కాగా శనివారం స్వైరవిహారం చేసిన అడవిపందిని కేశనకుర్రులో హతం చేసినట్టు సమాచారం. అడవిపంది నలుగురిపై దాడి చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మరణించిన రత్నరాజు

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన బొక్కా రత్నరాజు (45) తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి గట్టుపై ఉన్న గెస్ట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. శనివారం విద్యుత్‌మోటారును పైకి తీస్తుండగా మోటారు జారి పడి వైర్లపై పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ విభేదాల కారణంగా గత 10 సంవత్సరాలుగా విడిగా ఉంటున్నాడు. మృతుడి అన్న కొడుకు బొక్కా లక్ష్మణ్ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

అత్తారింటికి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు...

లారీ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



సాయినిరంజన్ (ఫైల్)

ఆలమూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అత్తారింటికి వెళ్లి వస్తూ లారీ ఢీకొని యువకుడి మృతిచెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్ల వద్ద శనివారం జరిగింది. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన వల్లూరి సాయినిరంజన్ (28) హైదరబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్నాడు. గతేడాది ఆగస్టు 23న వివాహమైంది. శనివారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా తణుకు అత్తవారింటికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై పయనమయ్యాడు. పెదపళ్ల కొత్తూరు సెంటర్ నుంచి అచ్యుతాపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెదపళ్ల కోళ్లఫారం సమీపంలో అతడిని లారీ వేగంగా వచ్చి ఢీకొంది. తలకు తీవ్ర గాయామై అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో సాయినిరంజన్‌ను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివాహమై ఏడాది కాకుండానే సాయినిరంజన్ మరణించడంతో బంధువులు బోరున విలపిస్తున్నారు.

యువకుడి అదృశ్యం...

అక్విడెక్టుపై బైక్, చెప్పులు, దుస్తులు, యాసిడ్‌బాటిల్



అదృశ్యమైన గోవిందరాజులు

ముమ్మిడివరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు గ్రామానికి చెందిన అద్దంగి గోవిందరాజులు (30) అదృశ్యంపై కేసు నమోదైంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా గోవిందరాజులు భార్య భవానీని పూజా సామగ్రి కొనేందుకు గురువారం సాయంత్రం మురమళ్ల తీసుకెళ్లి తిరిగి ఇంటి దగ్గర దింపి యానాంలో తాను పనిచేసే చోట ఒక వ్యక్తి సొమ్ములు ఇవ్వాలని తీసుకుని వస్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భార్య భవానీ భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో గోవిందరాజుల స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ తెలియలేదు. దీంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌కు భవానీ ఫిర్యాదు చేసింది. గోవిందరాజులు కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా అన్నంపల్లిలోని కొత్త అక్విడెక్టుపై గోవిందరాజులు మోటారు సైకిల్, చెప్పులు, దుస్తులతో పాటు సగం ఉన్న యాసిడ్ బాటిల్ కనిపించింది. దీంతో ఆరు పడవలపై గోవిందరాజుల కోసం అన్నంపల్లి అక్విడెక్టు నుంచి బలుసుతిప్ప వరకు గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం వరకు అతడి ఆచూకీ లభ్యం కాలేదు. గోవిందరాజులు గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.



అన్నంపల్లి నూతన అక్విడెక్టుపై ఉంచిన మోటారు సైకిల్, దుస్తులు, యాసిడ్ బాటిల్



గోదావరిలో గాలిస్తున్న దృశ్యం

దుబాయ్‌లో చిక్కుకున్న అంబాజీపేట యువకుడు

ఏజెంటు మోసం

కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారుల జోక్యం



కనకరాజు

అమలాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు పంపిస్తామని ఏజెంట్లు చేస్తున్న మోసాల్లో మరో యువకుడు చిక్కుకున్నాడు. అతడిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట గ్రామానికి చెందిన పొన్నాడ మంగ కుమారుడైన పొన్నాడ కనకరాజు ఒక నకిలీ ఏజెంటు చేసిన మోసంలో చిక్కుకున్నాడు. నెలకు రూ.50వేలకు పైగా జీతం వస్తుందని నమ్మబలికి కేవలం 8 గంటల పని మాత్రమే గల్ఫ్‌లో చేయాల్సి ఉంటుందని కనకరాజును దుబాయ్‌కు పంపించారు. అయితే ఏజెంట్ చెప్పిన మాటలకు, అక్కడ ఉన్న పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సరైన పని దొరకక పోవడం, అక్కడ యజమానులు పెట్టే ఇబ్బందులను భరించలేని పరిస్థితుల్లో తల్లి మంగకు తన కష్టాన్ని కుమారుడైన కనకరాజు చెప్పుకున్నాడు. దాంతో పొన్నాడ మంగ అమలాపురం కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను ఆశ్రయించింది. ఎన్నో అప్పులుచేసి తన కుమారుడు ఏజెంటు మాటలు నమ్మి దుబాయ్‌లో మోసపోయాడని, అతడిని స్వస్థలానికి రప్పించాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌ను అభ్యర్థించింది. దీనిపై స్పందించిన కలెక్టర్ మైగ్రేషన్ సెంటర్ నోడల్ అధికారి కె.మాధవి ఇచ్చిన ఆదేశాలతో కనకరాజును ఇండియాకు రప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దుబాయ్‌లో కనకరాజు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన అధికారులు ఇండియాకు రప్పించేందుకు విదేశీ రాయబార మంత్రిత్వశాఖ అధికారులతో సంప్రదింపులు చేసి కనకరాజును తీసుకొచ్చే చర్యలు చేపట్టామని నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ల రమేష్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో కలత చెంది...

ఉరేసుకున్న యువకుడు



మరణించిన అప్పారావు

మోతుగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం జెన్‌కో కాలనీకి చెందిన యువకుడు శుక్రవారం రాత్రి 10 గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సాధిక్ తెలిపిన వివరాలు ప్రకారం. మోతుగూడెం ఏపీ జెన్‌కో భవ్య హెల్త్‌కేర్ సెంటర్లో పనిచేస్తున్న గోసాని అప్పారావు (34) గతంలో 24 గంటల అపెంటిసైటీస్ సర్జరీ చేయించుకున్నాడు. అప్పటి నుంచి తీవ్రమైన అనారోగ్య సమస్యల వల్ల మానసికంగా కలత చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో తాను నివసిస్తున్న ఇంటో ఇనుసరాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని చింతూరు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సాధిక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రత్నగిరిపై వ్రత మండపాల్లో వర్షం నీరు

భక్తుల అసహనం

వ్రతాలు నిలుపుదలచేసిన ఈవో

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో రూ.వెయ్యి వ్రత మండపాల్లో శ్లాబ్ పెచ్చులూడి వర్షం నీరు పడడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. విషయం ఈవో సుబ్బారావు దృష్టికి చేరడంతో నీరు కారే వ్రత మండపాల్లో వ్రతాలు నిలిపి మిగిలిన మండపాల్లో చేపట్టాలని ఆదేశించారు.



పొంగి పొర్లిన 'అలుగువాగు'

ఎటపాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువప్రాంతం నుంచి వరదనీరు వచ్చి చేరడంతో అలుగువాగు ప్రాజెక్టు పొంగి పొర్లింది. అల్లూరి జిల్లా ఎటపాక మండలం అచ్యుతాపురం గ్రామం వద్ద ఉన్న అలుగువాగు ప్రాజెక్టు శనివారం వరదనీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహించింది. దీంతో వరదనీరు కుడి, ఎడమ కాల్వల నుంచి వాగులోకి ప్రవహించింది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకు ప్రాజెక్టు నిండలేదు. ఇటీవల వర్షాలకు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ఇదిలా ఉంటే ప్రాజెక్టు దిగువన గిరిజనులు చేపల వేటను సాగించారు.



గోదావరి గట్టు.. మేఘాల జట్టు...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద మేఘాలు కమ్ముకుని కనువిందు చేశాయి. ఈ అందమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కనకదుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యేదాట్ల

తాళ్లరేవు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):సీతారామపురంలో నూతనంగా ప్రజల విరాళాలతో నిర్మించిన శ్రీకనక దుర్గాదేవిఆలయంను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శనివారం సందర్శించారు. ఆలయకమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సా యి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ఈశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు పాల్గొన్నారు.



పిఠాపురంలో కురుస్తున్న వర్షం

పిఠాపురంలో భారీ వర్షం

● నీట మునిగిన పొలాలు

పిఠాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం తెల్లవారుజామున 3గంటల నుంచి ఉదయం 9గంటల వరకూ వర్షం పడుతూనే ఉంది. పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ డ్రైన్లు పొంగిపొర్లాయి. ఆర్టీసీ కాంప్లెక్సు, చర్చిసెంటర్, మార్కెట్ సెంటర్, ఉప్పాడ సెంటర్, సినిమా సెంటర్, పాతబస్టాండు, అంబేద్కర్ సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. మధ్యాహ్నం నుంచి ఎండ కాసింది. సాయంత్రానికి ఉక్కపోత పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వర్షపు నీరు పంటపొలాల్లో నిలిచి ముంపునకు గురయ్యారు. బైపాస్‌రోడ్డు, ఇల్లింద్రాడ, జములపల్లి తదితర ప్రాంతాల్లో వరి నాట్లు, వెదజల్లు పద్ధతిలో వేసిన పంటపొలాల్లో నీరు చేరింది. ప్రస్తుతం ఈ నీటికి బయటకు పంపే ప్రయత్నాల్లో రైతులు నిమగ్నమయ్యారు.

మంచినీటి కుళాయి బోరింగ్ ప్రారంభం



మంచినీటి కుళాయి బోరింగ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహాయనిధి నుంచి స్థానిక పేర్రాజుపేట రైతు బజార్ బ్రిడ్జి దిగువన గల కాకినాడ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంలో మంచినీటి కుళాయి బోరింగ్‌ను ఏర్పాటు చేశాకు. ఈ బోరింగ్‌ను కాకినాడ నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విజయ్, గౌరవ సలహాదారు స్వరూప్, అధ్యక్షుడు మాధవ్, ఉపాధ్యక్షుడు నేంతుల్లా, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి నరేష్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రవాసభారతీయుల కృషి అభినందనీయం

● ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోటలో బస్‌షెల్టర్‌ను ప్రారంభించి కూర్చున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం పేరిట మహి ళలకు ఉచిత బస్సు సదుపాయం కలుగజేయ గా ప్రయాణికులకు మెరుగైన సేవలంది ంచేందుకు సామర్లకోటకు చెందిన ప్రవాస భారతీయులు డాక్టర్ బిందు కుటుంబం తమ తండ్రి త్సలికి సూర్యనారాయణ జ్ఞాపకార్థం రూ.5.20లక్షల సొంతనిధులతో రెండు బస్‌షెల్టర్లు నిర్మించడం అభినందనీయం అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట పట్టణంలో శనివారం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం సమీపాన, సీబీఎం స్కూల్ కూడలి సమీపాన నిర్మించిన బస్‌షెల్టర్లను డీసీసీబీ చైర్మన్, పెద్దాపురం మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజులతో కలిసి ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్ర మంలో రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీష్‌మోహన్(బాబు), వెలగా రాజేశ్వరరావు, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, అందుగుల జార్జీచ క్రవర్తి, ఎండీ సైపుల్లా, సరోజా వాసు, వల్లూరి దొరబాబు, మహంకాళి వెంకటగణేష్, దాట్ల శ్రీను, యండమూరి వాసు పాల్గొన్నారు.

ఐక్యతగా సమస్యలు పరిష్కరించుకోవాలి



ఎన్నికల నిర్వహణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎరుకుల సామాజిక వర్గీయులు ఐక్యతగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా ఎరుకుల సంఘ నాయ కులు మాసగిరి రాంబాబు, మాసగిరి కోదండరాంబాబు, సాలా మహాలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జగన్నాధపురంలో జిల్లా సంఘ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో విడివిడిగా ఉన్న సంఘాలన్నీ ఒక తాటిపైకి తీసుకు రావడంలో భాగంగా జిల్లాలోని 21మండలాలకు సంబంధించి అధ్యక్షుడి ఎంపికను ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న కాకినాడ జగన్నాధపురం ఎంఎస్ఎన్ ఛార్టీస్ ఎదురుగా గల మత్స్యకార కళ్యాణ మండపంలో ఈఎన్నికలు జరుగనున్నా యన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి ఎరుకుల సామాజిక వర్గీయులు వచ్చి అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న వ్యక్తుల్లో తమకు నచ్చిన వ్యక్తికి ఓటువేసి గెలిపించుకోవాల న్నారు. సామాజిక వర్గీయులలో ఎవరైనా పోటీ లో నిలబడవచ్చన్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వివిధ మండలాల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కాకినాడసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్ర మాల్లో భాగంగా సభ్యుల సహాయ సహకారాలతో కాకినాడ టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం 33 మంది పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు రూ.70వేలు నగదును స్కాలర్ షిప్‌లుగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు జి సత్యనారాయణ మూర్తి (నానాజీ), కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ కు టౌన్ హాల్ కమిటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రతి యేటా మాదిరిగానే ఈ సంవత్సరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గోలి రఘునాథ్, సంయుక్త కార్యదర్శి వివి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సూర్యనారాయణరాజు, కమిటీ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సతీష్, సుసర్ల సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, సత్యనారాయణ, బసవా ప్రసాద్, రామచంద్రరాజు, వి ఆనంద్, చార్మినార్ వర్మ, సుబ్రహ్మణ్యేశ్వరరావు, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జైగణేష్ మాలధారణ

● 27 నుంచి నవరాత్రి మహోత్సవాలు

● పోస్టర్లు ఆవిష్కరించిన జనసేన నేతలు



పిఠాపురంలో జైగణేష్ మాలధారణ, నవరాత్రి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న జైగణేష్ దేవస్థానంలో ఏటా 11 రోజుల పాటు జరిగే జైగణేష్ మాలధారణ ఈనెల 25న ప్రారంభం కానున్నది. అదేవిధంగా వినాయక చవితి సందర్భంగా నవరాత్రి మహోత్సవాలు 27నుంచి సెప్టెంబరు 4 వరకూ జరుగుతాయి. వీటికి సంబంధించిన ఆహ్వానపత్రికలు, పోస్టర్లను జైగణేష్ దేవస్థానంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. 25వ తేదీన విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణం, అనంతరం దీక్షాధారణ జరుగుతుంది. ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని మర్రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సున్న శ్రీరాములు, ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణ, జనసేన నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కూటమి పార్టీలకు చెందిన టీడీపీ, బీజేపీ నాయకులను ఆహ్వానించకపోవడంతో తెలుగుదేశంపార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదాయశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగాలేదని వారు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని వారు భావిస్తున్నారు.



సామర్లకోటలో ఉట్టి కొడుతున్న చిన్నారులు, కొత్తపల్లి శ్రీవేణుగోపాలస్వామికి పూజలు నిర్వహిస్తున్నదృశ్యం, పిఠాపురం పాతయాదవ వీధిలో గోపాలకృష్ణస్వామి, అన్నదానం చేస్తున్న రవి

ప్రజలకు ఇష్టమైన వేడుక కృష్ణాష్టమి

● ఉట్టి కొట్టిన మంత్రి సుభాష్ ● ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సీతారామపురం శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యేదాట్ల సుబ్బరాజు

కాజులూరు(కరప), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం గొల్లపాలెంలో శనివారం జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరై ఉట్టి కొట్టారు. స్థానిక ఆలయం వద్ద గ్రామస్తులు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆయన భక్తులతో కలిసి ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ ఎంతో ఇష్టమైన కృష్ణాష్టమి వేడుకను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణ, గోపికల వేషధారణలో సభికులను అలరించారు

సామర్లకోట: సామర్లకోట పట్టణంలోనూ, మండలంలోనూ పలు కృష్ణమందిరాలలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. సామర్లకోట పట్టణంలో పురాతన రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన పండితులు వేణుఆచార్యులు, తదిత రులచే విశేషపూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు నమ్మి శ్రీనివాసు, రాంబాబు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పూజలు నిర్వ హించారు.

చిన్నారుల వేషధారణలు

సామర్లకోట పట్టణంలో ప్రతిభ విద్యాసంస్థ ఆవరణలో పాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే ప్రక్రియలో పాల్గొన్నారు. చిన్నారుల మధ్య పలు పోటీలు నిర్వహించి విజేతలకు విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్వీవీజీ ప్రకాష్, లయన్స్ పాస్ట్ అధ్యక్షురాలు సుధారాణీల బహు మతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యేదాట్ల

తాళ్లరేవు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు తాళ్లరేవు మండలంలో శనివారం ఘనంగా జరిగాయి. కోరింగ పంచాయతీ సీతారామపురం శ్రీకృష్ణా యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. స్థానికులు శ్రీకృష్ణ ఆలయం నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, ఆలయకమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. శ్రీకోరింగ వేణుగోపాలస్వామి, పి.మల్లవరం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్యనిర్వాహణ అధికారి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉట్టుకొట్టడం, కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పెదబొడ్డువెంకటాయపాలెం గ్రామపెద్దలు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించి ముగ్గులపోటీలు విజేతలకు బహుమతులను అందించారు. పాలెపు సత్తిబాబు, టోటి కామేశ్వరరావు, నరసింహస్వామి, పాలెపు ధర్మారావు, సంగాడి శ్రీను, గురువులు మల్లాడి వసంతరావు, దత్తాత్రేయ వర్మ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, జవ్వాది వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో పలుగ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలో ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాలస్వామి ఉత్సవవిగ్రహాలను కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల ప్రధాన వీధుల్లో పల్లకీలో ఊరేగించారు.

గోపాలకృష్ణుడికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: కృష్ణాష్టమి సందర్భంగా పిఠాపురం పట్టణంలోని పాత యాదవ వీధిలో ఉన్న గోపాలకృష్ణ స్వామికి శనివారం ప్రత్యేకపూజలు జరిగాయి. గోపాలకృష్ణుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గోపూజ జరిగింది. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయకమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా కృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పుష్పాలతో అలంకరించారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ కృష్ణమందిరంవద్ద, గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు.

భారీ అన్నదానం

కాకినాడ సిటీ: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక రామారావుపేట సెంటర్ గౌతమీ అపార్ట్‌మెంట్ వద్ద వ్యాపారవేత్త ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు భారీ అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు హోతా రవి విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా శ్రీనివాస్ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తూ భారీగా అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి యాప్రాన్ రేడియం కోట్లు పంపిణీ



శానిటేషన్ సిబ్బందికి యాప్రాన్ రేడియం కోట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : దూరం నుంచే వాహనదారులు గమనించేందుకు వీలుగా శానిటేషన్ సిబ్బందికి రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కొల్లాబత్తుల అప్పారావు యాప్రాన్ రేడియం కోట్లు పంపిణీ చేశారు. స్థానిక గాంధీనగర్ రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 14వ సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీ, మేస్త్రీలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేడియం కోట్లు ధరించడం వల్ల శానిటేషన్ సిబ్బందిని దూరం నుంచి వాహనదారులు గమనించగలరన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి వెంకట్, న్యాయవాది వాల్తేర్ రాంబాబు, సుందరపల్లి జీవి, తేజ, వేణు, సన్ని తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో వాజ్‌పేయి వర్ధంతి

గొల్లప్రోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, నాయకులు మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, తంగెళ్ల బాబూరావు, వియ్యపు రమణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కమిషనర్‌కు ఉత్తమ సేవా పురస్కారం



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నుంచి అవార్డు అందుకుంటున్న అదనపు కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ పురస్కారాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతులమీదుగా ఆయన అందుకున్నారు. అంతేకాకుండా నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కూడా సేవా ప్రశంసా పత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పిఠాపురంలో సామూహిక అనఘా దత్తవ్రతాలు

● భారీగా తరలివచ్చిన భక్తులు

పిఠాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో ఉన్న శ్రీపాదశ్రీవల్లభ అనఘాదత్త క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామిజీ చాతుర్మాస్య దీక్షలో భాగంగా నిర్వహించిన అనఘాదత్త వ్రతాల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలు నుంచి భక్తులు తరలివచ్చారు. 1008 మంది దంపతులు వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా దత్త విజయానంద స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. బ్రహ్మ విష్ణు, మహేశ్వర స్వరూపమైన దత్తాత్రేయస్వామి, సరస్వతి, లక్ష్మీ పార్వతిల కలయికలైన అనఘాదేవికి అష్టసిద్ధులతో ఆచరించే వ్రతమే అనఘా వ్రతమని తెలిపారు. దీని వలన శుభఫలితాలు కలుగుతాయని చెప్పారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘాదత్త దత్తక్షేత్రం అనఘా దత్త వ్రతాలు ఆచరిస్తున్న దంపతులు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు సంబరాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి 2019 ఆగస్టు 16న గుర్తింపు వచ్చిన సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సూర్యనారాయణ, రమేష్‌కుమార్‌ల ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కాకినాడజిల్లా అధ్యక్షుడు ఎంపీఎస్ఎన్ఎస్ జగన్నాధం అధ్యక్షతన శనివారం సంఘ కార్యాలయంవద్ద జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం జగన్నాధం మాట్లాడుతూ సంఘానికి గుర్తింపు వచ్చి ఆరు సంవత్సరాలు అయ్యిందన్నారు. ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యో గుల సమస్యల పరిష్కారానికి సంఘం తరపున అనేక ఉద్యమాలు చేసి విజయం సాధిస్తామన్నారు. ఉద్యోగులు తమ సంఘం దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి జ్యోతుల రాంబాబు, నాయకులు, కాకినాడ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగుల సంఘ గుర్తింపు సంబరాల కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్నాధరావు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 10 వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. రూ.2,38,045 ఆదాయం లభించినట్లు ఆలయ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

● డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



జేసీ రాహుల్ మీనా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజారామ్

పెద్దాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సీసీగా పనిచేస్తున్న కరెడ్ల రాజారామ్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు రాజారామ్‌ను అభినందించారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

కరప, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఇతర అధికారులు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, జనసేనపార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, పేకేటి దుర్గాప్రసాద్, వీరంరెడ్డి ముత్యాలరావు, బిరుదా భాస్కరతమ్మయ్య, మెండు గోవిందు, ఏవో బీఎల్ నరసింహం, సిబ్బంది సుబ్రహ్మణ్యం, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి పునఃప్రతిష్ఠ

పిఠాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద త్యాగరాజస్వామి పవిత్రోత్సవ సహిత పునఃప్రతిష్ఠా కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. అమెరికాలో నివాసముంటున్న ఎన్ఆర్ఐ రాయవరపు భానుమతి కుటుంబసభ్యుల సహకారంతో త్యాగరాజస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు, కోట పణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పిఠాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) అపరిచితుల ఫోన్‌కాల్స్, మెసేజీలపై అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సైబర్ నేరాలపై శనివారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగే తీరు గురించి వివరించారు. ఎవరికి ఓటీపీ చెప్పకూడదని తెలిపారు. రకరకాల ఆఫర్ల పేరుతో వస్తున్న లింకులు ఓపెన్ చేయవద్దని చెప్పారు. అటువంటి అనుమానాస్పద మెసేజీలు, లింక్‌లు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.





దుర్గాదేవి బ్రహ్మోత్సవాలు

రౌతులపూడి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను పూజ్యం నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణపతి పూజ, అమ్మవారికి కుంకమార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులు పూజలు నిర్వహించి ఆఖరి రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్టు శ్రీనివాసా వర్తక సంఘం సభ్యులు తెలిపారు. కోరుప్రోలు బుజ్జిబాబు నాయడ పద్మ, జిగిరెడ్డి శ్రీను, రమణమ్మ, యడ్ల బుజ్జి, రమణమ్మ దంపతులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

విలీన మండలాలకు ఉచిత బస్ లేనట్టే!

- మహిళలకు వర్తించని స్త్రీశక్తి పథకం
- కూనవరం నుంచి భద్రాచలానికి 50 కిలోమీటర్లు
- ఇందులో కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే అంతర్రాష్ట్ర సర్వీసులోకి
- సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకోవాలని వేడుకోలు


డబ్బులిచ్చి టికెట్ తీసుకుంటున్న విలీన మండలాల మహిళలు

కూనవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి ఉచిత బస్ పథకం మన్యంలోని విలీన మండలాల మహిళలను నిరాశపరిచింది. ఇక్కడి వారికి వర్తించదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ మండలాల్లో అన్నీ అంతరాష్ట్ర సర్వీసులు నడుస్తాయి... కాబట్టి నిబంధనల ప్రకారం అంతర్రాష్ట్ర సర్వీసులో జీరో టికెట్ సౌలభ్యం లేదంటున్నారు. సర్వీసులన్నీ అంధ్రాలోని వివిధ ప్రాంతాల నుంచి మొదలై తెలంగాణలోని భద్రాచలానికి చేరుకంటాయి. అందువల్ల వీటిని అంతర్రాష్ట్రాల సర్వీసులుగా పరిగణిస్తున్నారు. అయితే ఈ బస్సులు ప్రయాణించే రహదారిలో కేవలం రెండు కిల్లోమీటర్లు మాత్రమే తెలంగాణ భూభాగం ఉంటుంది. మిగతాదంతా ఆంధ్రాయే... ఉదాహరణకు కూనవరం నుంచి భద్రాచలంకు 50 కిలోమీటర్లు దూరం. కూనవరం నుంచి బయలుదేరిన బస్సు 48 కిలోమీటర్లు ఆంధ్ర భూభాగంలోనే నడుస్తుంది. కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే తెలంగాణ భూ భాగంలో నడుస్తుంది. ఈమాత్రం దానికి తమకు ఉచిత బస్సు లేదనటం సబబు కాదని మహిళలు వాపోతున్నారు. సీఎం, డిప్యూటీ తక్షణమే జోక్యం చేసుకోని ఉచిత బస్సు పథకం వర్తించేలా చూడాలంటున్నారు.

మన్యం సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

- రూ.225 కోట్లతో 11 మండలాల్లో పలు అభివృద్ధి పనులు
- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి వెల్లడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మన్యం సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళిక అమలు చేస్తోందని, దీనికోసం సుమారు రూ.225 కోట్లకు పైగా నిధులతో 11 మండలాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వెల్లడించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా మాట్లాడారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు చోళ్ల బొజ్జిరెడ్డి, ప్రాజెక్టు అధికారి సింహాచలం, సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్, డీఎస్పీ ప్రశాంత కుమార్ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివాసీ ఉద్యమకారుడు అల్లూరి జన్మించిన ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు. మన్యంలోని ఏడు మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

యువత మత్తు పదార్థాలు వాడొద్దు


ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు

మోతుగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో శనివారం సీఆర్పీఎఫ్ క్యాంప్ ఆఫీసులో మత్తుపదార్థాల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జవాన్లు ర్యాలీగా బయలుదేరి మత్తుపదార్థాలు సేవిస్తూ యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక మార్కెట్ సెంటర్‌లో నినాదాలు చేశారు. అనంతరం సీఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ గ్రామస్థులకు మత్తుపదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. దీనిలో భాగంగా గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.సీఆర్పీఎస్ ఏ/42 బెటాలియన్ జవాన్లు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఎటపాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైన స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చునని టీడీపీ సీనియర్ నాయకుడు పూరేటి వెంకటేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్ పేర్కొన్నారు. శనివారం సీతా పురంలో మహిళలు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు, అపకా రాంబాబు,గద్దల మణి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మోతుగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో శనివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పలువురు చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఇందులో గోపికలు, చిన్ని కృష్ణుడి వేషాలతో డీఏవీ పాఠశాలలో పోటీలు నిర్వహించారు.

కూనవరం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అనేక గ్రామాల్లోని భక్తులు ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు. కూనవరం మండల కేంద్రంలోని గొల్లబజార్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

వీఆర్‌పురం: మండల కేంద్రం వీఆర్‌పురంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. రామలయం దగ్గర, విఘ్నేశ్వర స్వామివారి ఆలయం దగ్గర, వీఆర్‌పురం బీసీ కాలనీ, పట్టివారి వీధి, రేఖపల్లిలోని ప్రధాన కూడళ్లలోనూ పండుగను పురస్కరించుకొని భక్తులు మండపాలు ఏర్పాటు చేసి, వాటికి సంప్రదాయబద్ధంగా యాదవులతో కుండపోత వర్షంలోనూ ఉట్టి కొట్టే సంబరాన్ని వైభవంగా జరుపుకున్నారు.

70 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్

రాజవొమ్మంగి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): లోదొడ్డి గిరిజన ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు. గతంలో ఒక రెగ్యులర్ టీచర్, ఇద్దరు కాంట్రాక్ట్ టీచర్లు ఉండేవారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో ఇద్దరు కాంట్రాక్ట్ టీచర్లు వేరే పాఠశాలలకు బదిలీ అయ్యారు. దీంతో ఒకటి నుంచి ఐదు వరకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు. దీనిపై శుక్రవారం లోదొడ్డి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు , విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన తెలిపారు.

ఘనంగా వాజపేయి వర్ధంతి


చింతూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చింతూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చింతూరులో శనివారం దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఏడో వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్యరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు జమాల్‌ఖాన్, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మడివి రాజు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కృష్ణం వందే జగద్గురుమ్


ఏలేశ్వరం: సిరిపురంలో అలంకరణలో రాధాకృష్ణులు

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణుడు, గోపికల వేషధారణలు
- భక్తులతో ఆలయాలు కిటకిట



ప్రత్తిపాడు: ఏలూరులో ఉట్టి కొడుతున్న భక్తులు, తుని శ్రీప్రకాష్‌లో కృష్ణాష్టమి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం




గండేపల్లిలో కృష్ణుడిని దర్శించుకుంటున్న జాస్తి వసంత్, శంఖవరం: కత్తిపూడిలో ఉట్టి కొట్టే సంబరం నిర్వహిస్తున్న దృశ్యం, కిర్లంపూడి: శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలేశ్వరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి పురస్కరించుకుని శనివారం పట్టణంలో యాదవ సంఘం, వాగువారి వీధిలో కృష్ణుని ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలుచేసి ప్రసాదాలు స్వీకరించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మహిళలు పారాయణం నిర్వహించారు. సిరిపురం, లింగంపర్తి గ్రామాల్లో కృష్ణుని ఆలయాల వద్ద ఉట్టి కొట్టే ఉత్సవం నిర్వహించారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఉన్న శ్రీకృష్ణుడు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ్‌నగర్‌లో శ్రీవరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. పీల మణికంఠ, జగదీష్, ప్రసాద్ పాల్గొన్నారు. కాకినాడ రోడ్‌లో గల శ్రీకృష్ణుని గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీరాజగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సభ్యులు, వాసవి మాత సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు

తొండంగి, (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం ఏవీనగరంలో రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు మిశ్రా తదితరులు కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. వందలాదిగా హాజరైన భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా అర్చకులు కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త యనమల నాగేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బెండపూడి, తొండంగి, శృంగవృక్షం, పెరుమాళ్ళపురం, సీతారాంపరురం తదితర గ్రామాల్లో అభిషేకాలు ప్రత్యేక పూజలు జరిపారు. ఉట్టి ఉత్స వాన్ని ఆనందోత్సాహాల జరిపారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): నీలాద్రిరావుపేటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. స్వామివారిని పల్లకీలో భాజాభజంత్రీలు, తీన్మార్, బాణసంచా కాల్చుతూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మల్లేపల్లి బీసీకాలనీలో కృష్ణుడు ఆలయం వద్ద వేడుకలు జరిగాయి. టీడీపీ మండల యువ నాయకుడు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): ఎస్.అగ్రహారం, రౌతులపూడి, మూలగపూడి, ఎ.మల్లవరం తదితర గ్రామాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో కృష్ణామి వేడుకలు నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. ఆలయాల వద్ద అన్నదానాలు జరిగాయి. కృష్ణుడి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురంలోని కృష్ణుడు ఆలయంలో కందా మణిదీప్ సతీమణి సుధా దంపతులతో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కందా సత్యానందం సతీమణి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి వేణుగోపాలస్వామి గుడిలో చైర్మన్ కేళంగి నూకరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కత్తిపూడి యాదవపేట లో స్వామివారిని పల్లకీపై ఊరేగించారు. సాయంత్రం ఉట్టి కొట్టే సంబరం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భారీ సంఖ్యలో యువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తునిరూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో శ్రీ కృష్ణాష్టమి సంబరాలు ఘనంగా జరిగాయి. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. ఉట్టికొట్టే ఉత్సవంలో సందడి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): వాకపల్లిలో యువకులు కేరింతలు కొడుతూ ఉట్టికొట్టే సంబరం నిర్వహించారు. ధర్మవరం బైపాస్ రహదారి జంక్షన్‌లోని కృష్ణుడి విగ్రహానికి పూజలు నిర్వహించి ఊరేగించారు. స్థానికులు అన్నప్రసాద పంపిణీ నిర్వహించారు. ఏలూరులో కృష్ణుని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాడిశెట్టి గోపి, ఎంపీటీసీ దాడిశెట్టి రాణి చక్రధర్, దాడిశెట్టి అనంత బాబ్జి, కొట్టేటి అబ్బులు, సత్యారావు, సూర్యారావు, చిన్నయ్య, శేషు, శేషగిరి పాల్గొన్నారు.




తొండంగి: రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, రౌతులపూడి: మంచంపై చిన్ని కృష్ణుడు, జగ్గంపేట: గోపిక, కృష్ణుడు వేషధారణల్లో చిన్నారులు

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే యనమల దివ్య


ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ రైతులు చేపట్టిన ర్యాలీని ప్రారంభిస్తున్న యనమల దివ్య

తునిరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ తొలివిడత నిధులు రైతాంగం ఖాతాల్లో జమ అవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం తునిలో పెద్ద ఎత్తున ట్రాక్టరతో ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే దివ్య జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, కూడా వెంకటరమణా దంతులూరి శ్రీనివాస్ రాజు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ, అవుగడ్డి వెంకటరమణ ఉన్నారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

తునిరూరల్,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రంలో శ్రీకృష్ణా జన్మాష్టమిని పురస్కరించుకుని ఎమ్మెల్యే యనమల దివ్య దంపతులు పూజలు ఆచరించారు. క్షేత్ర పీఠాధిపతులు శ్రీసచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన గోపూజల్లో ఎమ్మెల్యే దంపతుల పాల్గొన్నారు. క్షేత్రంలో శ్రీకృష్ణగోపిక వేషధారణలు, ఉట్టి కొట్టే వేడుక అలరించాయి. టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి ఉన్నారు.

రోడ్డు నిర్మించాలంటూ ధర్నా

ఏలేశ్వరం, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట నుంచి జె.అన్నవరం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పునఃనిర్మించాలంటూ పలు గ్రామాల యువకులు రోడ్డుపై బైఠాయించారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు యువతకు నచ్చచెప్పడంతో ధర్నాను విరమింపచేశారు.

మహిళలకు ఫ్రీ బస్ ప్రయాణం

జగ్గంపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఫ్రీ బస్ ప్రయాణం నేపథ్యంలో మహిళలకు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జగ్గంపేట కాంప్లెక్స్‌లో స్క్వాడ్‌ను నియ మించారు. మహిళలకు ఏమైనా ఇబ్బం దులంటే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలియజేశారు.




ఉచిత బస్సు సిబ్బందిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఉచిత బస్సు సిబ్బందికి సన్మానం

తొండంగి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరంలో శనివారం మహిళా శక్తి ఉచిత బస్సు సిబ్బందికి టీడీపీ స్థానిక నాయకులు పలువురు సన్మానించారు. గ్రామం నుంచి మహిళా శక్తి ఉచిత బస్సును టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం బస్సు కండక్టరు, డ్రైవర్లను పూలమాలలతో సత్కరించి స్వీటు బాక్సులు అందించారు. అధిక సంఖ్యలో మహిళలు ఉచిత బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో యనమల వెంకటేశ్వర్రావు (పెదబాబు), కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.


జగ్గంపేటలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా రెండో మహాసభలు జగ్గంపేటలో సెప్టెంబరు 30, అక్టోబరు 1న జరగనున్నాయని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు వాల్‌పోస్టర్‌ను రావులమ్మ గుడి వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో రొంగల ఈశ్వరరావు, కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, కెంగం దుర్గాప్రసాద్, నండ్ల చిరంజీవి, పెన్నాడ వీరబాబు, కంది బాబు, కంది సతీష్, గంగుమళ్ల శ్రీను పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎం పవన్ నుంచి పురస్కారం అందుకుంటున్న వైద్యాధికారి ప్రణీత్

వైద్యాధికారికి ఉత్తమ సేవా పురస్కారం

గండేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జెడ్.రాగంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రణీత్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. కాకినాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందుకున్నారు.


లంపకలోవలో బూరయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ప్రత్తిపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ సీనియర్ నాయకుడు, సుబ్బారెడ్డి సాగర్ మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు చెక్కపల్లి బూరయ్యను శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శించారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది లంపకలోవలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆరోగ్య పరిస్థితులను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వరుపుల రామకృష్ణ, సర్పంచ్ పి.మణి దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు చెక్కపల్లి మందేశ్వరరావు, యాళ్ల జగదీష్, చెక్కపల్లి నవీన్, అంబటి రాంబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కోశాధికారికి సన్మానం


ప్రకాష్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

జగ్గంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కోశాధికారిగా జగ్గంపేట గ్రామానికి చెందిన దుర్గపు ప్రకాష్‌ను రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బి.నూకబాబు, బొండా వీరసత్య, కంచర్ల శ్రీనివాసరావు, కొత్త శ్రీరామకృష్ణ, వి.శ్రీరామ్మూర్తి, పిశంకర్, బొండాడ జగన్, మానేపల్లి రామానుజ, దుర్గపు ప్రకాష్, బొండా అయ్యప్ప, మాతంశెట్టి నారాయణ, కొత్త నాగ పండు పాల్గొన్నారు.



శివకుమార్‌కు సన్మానం

ప్రత్తిపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంప శివకుమార్‌ను శనివారం రౌతుపాలెంలో సన్మానించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామ సంఘ పెద్దలు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సానబోయిన కుసరాజు, మన్యాల వీరబాబు, పక్కుర్తి శ్రీను, ఎస్.ఆదిబాబు, కొండల శ్రీను, గుణ్ణం సత్తిబాబు, సూరిబాబు, మన్యాల సత్తిబాబు, అప్పారావు, అల్లి నాగేశ్వరరావు, కోర్ని సతీష్ పాల్గొన్నారు.

19న ఆధార్ శిబిరం

ప్రత్తిపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎం పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో 19న ప్రత్తిపాడు మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నిర్వహించే ఆధార్ శిబిరాన్ని చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జి.శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు, పురుషులకు ఆధార్ సర్టిఫికెట్ ఉచితంగా అందించడానికి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధి పథకాలకు ఉపయోగించుకోవడానికి, వ్యాపారాభివృద్ధికి బ్యాంకు నుంచి రుణాలు పొందేందుకు ఈ ఆధార్ తప్పనిసరిగా ఉపయోగపడుతుందన్నారు. ఆధార్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో లింకైన బ్యాంక్ పాస్‌బుక్, మెయిల్ ఐడీ తప్పనిసరిగా తీసుకురావాలని ఏపీఎం కోరారు.

అంగన్‌వాడీ తుని ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక

తునిరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి తుని ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక శనివారం బ్యాంక్ కాలనీలోని బాలభవన్‌లో జరిగింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రవతి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేష బాబ్జి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డి.మేరీ సమాధానం, ఎన్.శ్రీనివాస్, అధ్యక్షురాలిగా నెమల రాణి, కార్యదర్శిగా వై.ధనలక్ష్మి, కోశాధికారిగా రమణమ్మ, ఉపాధ్యక్షులుగా ఉమామహేశ్వరి, శ్రీలక్ష్మి, ఆఫీస్ బేరర్లుగా లోవమ్మ, సుజాత, మంగ, భవాని, ఇందిర, కృష్ణవేణి, శాంతి కుమారి, చిట్టి పాప, పద్మ, రాములమ్మ, సుబ్బలక్ష్మి ఎన్నికయ్యారు.